

భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. - 8లో



కర్నూలు జట్టు ఘన విజయం

కడపలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు విజయం సాధించింది. కర్నూలు బౌలర్ అక్షిత్‌రెడ్డి ఒక్క మ్యాచ్‌లో 12 వికెట్లు తీసి సత్తా చాటాడు. - 8లో

గరిష్టం/కనిష్టం 34.0 /24.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 28.4 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఎస్టీఎఫ్ నూతన కార్యవర్గం



శ్రీనివాసులు విద్యాసాగర్ రామచంద్ర

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీ ఎస్టీఎఫ్) నూతన కార్యక్రమాన్ని కడపలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఆవుల శ్రీనివాసులు, అధ్యక్షుడిగా విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర, జిల్లా కోశాధికారిగా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌లుగా రవీంద్రరెడ్డి, సుమలత, గౌరవ సలహాదారుగా శంకరయ్య, జిల్లా కార్యదర్శులుగా చంద్రశేఖర్, సాగర్, వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్, మదప్‌రెడ్డి, సీతారామయ్య, శ్రీనివాసులు, నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. శ్రీనివాసులు, రామసుభాష్‌రెడ్డి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, రామచంద్రలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ



హరికృష్ణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టగా వి.హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కర్నూలు ఏడీగా పనిచేస్తున్న ఈయనకు వైఎస్సార్ జిల్లా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఇక్కడ పనిచేస్తున్న భీమయ్య పదోన్నతిపై ఒంగోలు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వి.హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని చేనేత వర్గాల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. చేనేత కార్మికులు ఎటువంటి సమస్యలు ఎ దురైనా తమను సంప్రదించవచ్చని సూచించారు. అధికారులు శేషగిరి రావు, కృష్ణ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణకు ఆదేశం

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయ కార్యదర్శి సుజాతపై విచారణకు సోమవారం కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పంచాయతీ కార్యదర్శి తరచూ విధులకు గైర్హాజర్ కావడం, విధి నిర్వహణలో అలసత్వ ధోరణి, ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేక పోవడంతో గ్రామాల్లోని కొన్ని ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. విధులకు డుమ్మా కొడుతూ యోగివేమన వర్సిటీలో రెగ్యులర్ పీజీ చేస్తున్నట్లు ఫిర్యాదు కూడా ఉందన్నారు. మంగళవారం నుంచి ఈ అంశంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఎంపీడీఓను ఆదేశించినట్లు డీపీఓ తెలిపారు.

6న చేనేతలకు సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 6వ తేదీన చేనేత కార్మికులను సత్కార సభను నిర్వహించనున్నామని తొగట వీర క్షత్రియ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, సీఆర్ఐ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు సీఆర్ఐ సునీల్ జయంత్‌లు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు చేనేత జౌళిశాఖ ఏడీ హరికృష్ణతో కలిసి ఆయన కార్యాలయంలో స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి అమోఘమన్నారు. ఈనెల 21న వెంకటగిరిలో ఐదో విడత నేతన్న నేస్తం నిధులను విడుదల చేయడం అభినందనీయమన్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై చిరుత

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై సోమవారం రాత్రి 8 గంటలకు చిరుత సందర్శకులకు కనిపించింది. మదనపల్లెకు చెందిన భాస్కర్, అనిల్ బైక్‌పై హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. వె కొండపై పర్యటన ముగించుకుని 8 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి మలుపు దాటుకుని రెండో మలుపు వద్ద కాఫీతోట వద్దకు రాగానే చిరుత పులి తోటలో పొదల నుంచి వెళ్తుండటం చూసి భయాందోళనకు గురయ్యారు. అయితే చిరుతను చూడాలన్న కుతూహంతో బైక్ ఆపి చూడగా కాఫీతోటలో నుంచి అడవిలోకి వెళ్లిపోయిందని వారు చెప్పారు. కాగా హార్సిలీహిల్స్‌పై కొన్ని నెలల క్రితం ఘాట్‌రోడ్డులోని పలుచోట్ల చిరుతలు సందర్శకులకు కనిపించాయి. తాజాగా మళ్లీ కనిపించడంతో సందర్శకులు జాగ్రత్తలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రామములగ..
రక్షించుకునేదెలాగ?



ఇతని పేరు ప్రసాద్. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం తలారివాండ్లపల్లె. మూడు ఎకరాల్లో టమాట పంట సాగు చేశాడు. అనుకున్నంత దిగుబడి రాలేదు.మార్కెట్లో ధరలు బాగున్నాయి. ఉన్న పంటలో కాయల్ని కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నాడు. చుట్టు పక్కల రాత్రిళ్లు టమాటాలను దొంగలు చోరీ చేసుకెళుతున్నారు. దీంతో ఉన్న పంటను కాపాడు కోవడానికి కాపలా కట్టుదిట్టం చేసుకోవడం తప్పడం లేదు. ప్రస్తుతానికి కుటుంబ సభ్యులతో పాటు మరో ఇద్దరిని కాపాలాగా ఏర్పాటు చేసుకున్నాడు. పంట కాలం ముగిసే వరకు 24 గంటలు కాపాలా కాసే వారిని ఏర్పాటు చేసుకుంటున్నాం. వారికి నెలకు రూ. 15 వేలు వరకు చెల్లించాలని చెబుతున్నాడు.



ఇతని పేరు సుమన్. గుర్రంకొండ మండలం అమిలేపల్లె. తాతలు, తండ్రుల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారు. ఎప్పుడు కూడా ఏ పంటకు ఇలా కాపాలా పెట్టుకోలేదు. టమాట చరిత్రలో ఎప్పుడు లేనంతా ధరలు పెరిగిపోయాయి. దొంగలు కూడా పంటలపై పడి కాయలు చోరీ చేసుకెళుతున్నారు. దీంతో కూడా రాత్రిళ్లు పంటకు కాపలాగా ఉండాల్సి వస్తోందని చెబుతున్నాడు.

- టమాట క్రేట్ ధర రూ.3500-4000
- దేశచరిత్రలో ఇదే అత్యధికం
- తోటల్లో రాత్రిళ్లు కాయలు చోరీ



గుర్రంకొండ మండలం చెరువుమొరవపల్లెలో రాత్రిళ్లు దొంగలు టమాటాలు కోసుకెళ్లడంతో కాయలు లేకుండా ఉన్న తోట

గుర్రంకొండ(అన్నమయ్య జిల్లా) : టమాట రైతు ఓవైపు ఆనందంతో, మరోవైపు భయంతో రోజులు గడుపుతున్నాడు. టమాటా 25 కిలోల క్రేట్ ధర రూ.3500 నుంచి రూ.4000 వరకు పలుకుతోంది. జిల్లాలో పలుచోట్ల రాత్రిళ్లు టమాటాల్లో దొంగలు పడి ఇష్టానుసారంగా దోచుకెళుతున్నారు. చేసేదిలేక రైతులు టమాట పంటలకు కాపలాగా పడుకుంటున్నారు. మరికొందరు ఇతరులను ఏర్పాటు చేసుకుంటున్నారు.

జిల్లాలో ప్రస్తుతం 1080 టన్నులకు టమాట దిగుబడి పడిపోయింది. గత నెలలో 3000 టన్నుల వరకు ఉన్న పంట దిగుబడి 2/3 వంతు తగ్గి 1080 టన్నులకు నిలిచిపోయింది. గత ఏడాది జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల పరిధిల్లో ఈ సీజన్‌లో 14వేల నుంచి 15,204 ఎకరాల్లో టమాట పంట దిగుబడి వచ్చింది. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులు, టమాట పంటకు సోకిన వివిధ రకాల రోగాలతో ప్రస్తుతం తోటలు భారీగా దెబ్బతిన్నాయి. వీటితోపాటు భారీ ఎండల తాకిడికి పూర్తిగా పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అయితే రాయలసీమ జిల్లాల్లో ఈ సీజన్‌లో ఈ ప్రాంతంలో ఎక్కువగా టమాట పంట సాగుచేస్తుంటారు. వేసవి కాలంలో అన్ని ప్రాంతాల కంటే అన్నమయ్య జిల్లాలోని పడమటి ప్రాంతాలలో(పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె) వాతావరణమే టమాట సాగుకు కొంత మేరకు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఇక్కడి టమాటాలకు దేశ వ్యాప్తంగా భారీ డిమాండ్ ఏర్పడింది.

దేశ చరిత్రలో ఇవే అత్యధిక ధరలు

వారం రోజులుగా టమాట ధరలు భారీగా పుంజుకున్నాయి. ఇవి దేశ చరిత్రలో అత్యధిక ధరలుగా రికార్డయ్యాయి. పదిహేను రోజుల కిందట 25 కిలోల టమాట క్రేట్ ధరలు అత్యధికంగా రూ.1200 లోపే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఒక క్రేట్ ధర రూ. 3500 నుంచి రూ.4000 వరకు పలుకుతోంది. వారం రోజులుగా మార్కెట్లో దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోతోంది. మన రాష్ట్రంతో పాటు బయట రాష్ట్రాల్లో కూడా ఎక్కువగా టమాట పంటలు సాగు చేశారు. అయితే పలు కారణాలతో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో రాయలసీమలోని అన్నమయ్య జిల్లాలో సాగు చేసిన టమాటాలకు దేశవ్యాప్తంగా భారీ ఎత్తున డిమాండ్ ఏర్పడింది.

బయటి రాష్ట్రాల్లో దెబ్బతిన్న తోటలు

బయట రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో వైరస్‌లు, ఊజీరోగాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అక్కడి పంటలు రోగాల కారణంగా రెండు నుంచి మూడు కోతల్లోనే పంట కాలం ముగిసిపోయింది. వీటితోపాటు మన రాష్ట్రంలోనూ వివిధ రకాల వైరస్‌లు, ఊజీలు, వేసవి ఎండలకు టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. అయితే అన్నమయ్య జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఎంతో కొంత దిగుబడి వస్తోంది. ప్రస్తుతం బయట రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మన జిల్లా నుంచి టమాటాలు ఎగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో పండించే టమాటాలకు దేశ వ్యాప్తంగా భారీగా ధరలు వచ్చాయి.

చోరీకి గురవుతున్న కాయలు

టమాటాకు అధిక ధరలు రావడంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో తోటల్లో కాయలు చోరీకి గురవుతున్నాయి. రాత్రిళ్లు దుండగులు తోటల్లో చొరబడి కాయల్ని కోసుకెళుతున్నారు. ఉదయాన్నే తోటలకు వెళ్లే రైతులకు కాయలు లేని తోటలు కనిపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అరకొర పంట దిగుబడి రాగా ధరలు ఆశాజనకంగా ఉన్న సమయంలో కాయలు చోరీకి గురి అవుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. కొంతమంది ముఠాలుగా ఏర్పడి రాత్రిళ్ల టమాటాలను దొంగతనం చేస్తున్నారు.

వారం రోజులుగా మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు

తేదీ	స్టాకు (టన్నుల్లో)	ధరలు (25కేజీలక్రేట్)
జూలై 11	928	రూ.3700
12	986	రూ.4000
13	1054	రూ.4000
14	975	రూ. 3900
15	1080	రూ. 3800
16	1091	రూ.3300
17	985	రూ.3400

టమాటాల చోరీ

ములకలచెరువు : అన్నమయ్య జిల్లా సరిహద్దు ఎర్రబల్లికి చెందిన రైతు క్రిష్టారెడ్డి టమాటాల పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు.బాధిత రైతు ఐదు ఎకరాలలో టమాట పంట సాగుచేశాడు. మార్కెట్‌లో 30 కేజీల బాక్సు రూ.2 వేల నుంచి రూ. 3 వేల వరకు ధర పలుకుతోంది. పొలంలో సుమారుగా 20 క్రేట్ల వరకు టమాటాలు చోరీ అయ్యాయని, వాటి విలువ రూ.40 వేలు వరకు ఉంటుందన్నారు.

• రాత్రిళ్లు తోటలకు కాపాలా

టమాటాలు చోరీకి గురవుతుండటంతో చేసేదిలేక రైతులు పొలాల వద్దనే రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం నుంచి ఏడు ఎకరాల వరకు ఓ రైతు సగటున టమాటా పంట సాగు చేశాడు. గతంలో టమాటాలకు మంచి గిట్టుబాటు ధరలున్నా రైతులు పొలాల వద్ద కాపలా ఉండేవారు కారు. అయితే ప్రస్తుతం టమాటా ధరలు ఓవైపు భారీ ఎత్తున పుంజుకోవడం మరోవైపు రాత్రిళ్లు టమాట తోటల్లో చోరీలు ఎక్కువ కావడంతో కాపలా కట్టుదిట్టం చేసుకొంటున్నారు. కొంతమంది పంట నలువైపులా గుడిసెలు



వేసుకొని నలుగురు వ్యక్తులకు టార్చ్‌లైట్లు ఇచ్చి కాపాలాగా ఉంచుకొంటున్నారు. రాత్రిళ్లు అప్పుడప్పుడు టార్చ్‌లైట్లతో పొలంలో తిరుగుతున్నారు. కొన్నిచోట్ల రాత్రిళ్లు పంటకు కాపాలా కాసేవారు అరుపులు, కేకలు వేస్తూ ఇక్కడ కాపాలాగా ఉన్నాం అన్న సంకేతాలు ఇస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



పాములూరు గ్రామ సచివాలయం వద్దకు వెళుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు

వేంపల్లె : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లె మండలం పాములూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఆవరణంలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. సచివాలయాల పక్కనే రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో రోడ్డు సౌకర్యం కూడా లేని గ్రామాలకు ప్రస్తుతం రెండు లేన్ల రోడ్లను ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. గ్రామాల్లో కూడా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో వందశాతం సంతృప్తి కనిపిస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్‌తోపాటు తమ కుటుంబానికి లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరేలా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, డ్రిప్ పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, వైఎస్సార్ బీమా కలిస్తోందని తెలిపారు. అనంతరం రూ.20లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ చేతులమీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్‌లు శ్రీనివాసులు, బయమ్మ, లక్ష్మీ పావని, జగన్నాథరెడ్డి, ఉప సర్పంచ్ మధు ప్రభాకర్‌రెడ్డి, రామగంగిరెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, పీఆర్ డీఈ రవిచంద్రారెడ్డి, డీఈఈ శ్రీకాంత్, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లకు సమన్యాయం జరగాలన్నదే సీఎం ఆలోచన

రాష్ట్రంలోని కాంట్రాక్టు లెక్చరర్లందరికి సమ న్యాయం జరగాలన్నదే సీఎం జగన్ ఆలోచనలో ఉన్నట్లు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాములూరు గ్రామంలో కాంట్రాక్టు లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర నాయకులు మన్సూర్ లీ, మహబూబ్ బాషా, జిల్లా నాయకులు సుబ్బరాయుడు, రామయ్య, జిలాని, వెంకటేశ్వరి, కళావతిలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీకి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీసుకెళ్లడంతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ విజయరామరాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా ఫిర్యాదుల వేదిక స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు సమర్పించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఆయన ఫిర్యాదులు స్వీకరించి పరిశీలించారు. ఆయా అర్జీల పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఫిర్యాదుదారుల నుంచి అందే వినతులను బాగా పరిశీలించి విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోపు సమస్యకు పరిష్కారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యధుభూషణరెడ్డి, ఆనంద్‌నాయక్, ఎస్‌డీసీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి, సేకరణ పెంచాలి

జిల్లాలో పాడి పరిశ్రమ రంగాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు పాల ఉత్పత్తి, సేకరణ పెంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్న పాల వెల్లువ నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలోని మండలాలతోపాటు పెండ్లిమర్రి, వీఎన్ పల్లె మండలాల పరిధిలో ఇప్పటివరకు నిర్వహణలో ఉన్న, విస్తరణ చేపట్టిన గ్రామాల్లో పాల సేకరణ పెంచాలని చెప్పారు. అన్ని కేంద్రాల్లో 160 లీటర్లకు తగ్గకుండా పాల సేకరణ జరగాలన్నారు. ఎంపీడీఓలు, మెంటర్లు, ఆర్‌బీసీ, ఏపీడీడీసీఎఫ్ బాధ్యతతో కార్యచరణ చేపట్టాలన్నారు. బల్క్‌మిల్క్ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా సహకార అధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ, డీఆర్‌డీఏ పీడీలను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, జిల్లా సహకార శాఖ అధికారి సుభాషిణి, ఏపీడీడీసీఎఫ్ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎల్.వెంకటేశ్వరమ్మ, పశు సంవర్ధకశాఖ జేడీ శారద, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నందలూరు రైల్వే క్రూ సెంటర్ ఖాళీ!

- 55 మంది లోకో పైలెట్ల మూకుమ్మడి బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన డివిజన్ ఉన్నతాధికారులు



నందలూరు క్రూ సెంటర్

రాజంపేట : గుంతకల్ డివిజన్ రైల్వే ఉన్నతాధికారులు బ్రిటీషు పాలకుల నుంచి వెలుగొందిన నందలూరు రైల్వే క్రూసెంటర్‌ను ఖాళీ చేయించేందుకు దిశగా అడుగులు పడ్డాయి. లోకోపైలెట్లను మూకుమ్మడి బదిలీలు చేసేశారు. గుంతకల్ రైల్వేడివిజన్ ఉన్నతాధికారి పేరుతో ఉత్తర్వులు జారీ అయినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. డిపో పరిధిలో.90 మంది ఎల్‌పీజీ (లోకో పైలెట్ గూడ్స్)లు ఉన్నారు. ఇందులో 55 మందిని రేణిగుంట, ఎర్రగుంట్లకు బదిలీ చేశారు. ఇంకా 17 మంది రిలీవ్ కాలేదు. మిగిలిన 35 మంది అక్టోబరులోపు బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

నందలూరు రన్నింగ్‌స్టాప్‌లో ఉన్న లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్ల మూకుమ్మడి బదిలీపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది

ఎర్రగుంట్ల డిపోపై రన్నింగ్‌స్టాప్ ప్రతికూలత

ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ గుంతకల్ డివిజన్ ఉన్నతాధికారి స్వార్థం ఫలితంగా ఎర్రగుంట్ల క్రూసెంటర్ పుట్టుకొచ్చిందని రైల్వే వర్గాల్లోనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నందలూరు క్రూ సెంటర్‌ను క్లోజ్ చేసేందుకు జాతీయస్థాయిలో ఉన్న ఓ కాషాయనేత తన పలుకుబడితో రైల్వేబోర్డు నుంచి కూడా పరోక్షంగా ఒత్తిడి చేయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రతికూల పరిస్థితిలో ఉన్న ఎర్రగుంట్ల డిపో పరిధిలో పనిచేయడాన్ని రన్నింగ్‌స్టాప్ వ్యతిరేకిస్తున్నారు. ఆ అధికారి స్వార్థం ఫలితంగా రైల్వేకు అదనపు భారం మోపారు. ఈవిషయంను రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

కొత్త డీఆర్‌ఎం అయినా ..

గుంతకల్ డీఆర్‌ఎం వెంకట్రామిరెడ్డిపై రైల్వేబోర్డు బదిలీవేటు వేసింది. ఈయన స్థానంలో మనీషా అగర్వాల్ డీఆర్‌ఎంగా నియమితులయ్యారు. ఇంకా బాధ్యతలు తీసుకోలేదు. ఈయన రాకతో ఎర్రగుంట్ల డిపో ఏర్పాటు, నందలూరు డిపో నిర్వర్యం చేసిన అంశాలను తీసుకెళ్లాలని స్థానిక నాయకులు భావిస్తున్నారు. డిపో మూసివేతకు గుంతకల్ డివిజన్‌లో సంబంధిత ఉన్నతాధికారులు ఉత్సాహంగా ఉన్నట్లుగా కనిపిస్తోంది

ఇక రోజూ ఇళ్లకు శుద్ధి నీరు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న తాగునీటి సమస్య పరిష్కారమైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. కొళాయిల వద్ద మహిళలు ఘర్షణ పడే రోజుల నుంచి నేరుగా ఇళ్లకే శుద్ధి నీరు అందించే మంచి రోజులు వచ్చాయని అన్నారు. రూ.120 కోట్లతో నిర్మించిన అమృత్ తాగునీటి పథకం ట్రయల్ రన్‌ను సోమవారం సాయంత్రం స్థానిక ఆర్ట్స్ కాలేజీలోని వాటర్ ట్యాంకుల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొంత దూరం వరకు గడపగడపకు వెళ్లి ప్రస్తుతం పడిలిన తాగునీరు ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత పాలకులు ఇంత వరకు ఈ సమస్య గురించి పట్టించుకోలేదని, 2014 ఎన్నికల సందర్భంగా తాను సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చానన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాకపోవడంతో పరిష్కారం కాలేదని వివరించారు. మళ్లీ 2019లో హామీ ఇచ్చానని, తమ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యను పరిష్కరించామన్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నామమాత్రమేనని తెలిపారు. మున్సిపాలిటీ నుంచే డబ్బు వెచ్చించామన్నారు. శ్రీశైలం నుంచి గండికోట మీదుగా మైలవరం డ్యాం నుంచి పైపులైన్ ద్వారా నీరు ప్రొద్దుటూరుకు వస్తుందన్నారు. శ్రీశైలం డ్యాం ఎండితేనే ప్రొద్దుటూరుకు తాగునీటి సమస్య వస్తుందన్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక చాలా ప్రాంతాలకు నీటి సమస్య తగ్గిందని, అమృత్ పథకంతో రోజూ పగటి పూట పట్టణ ప్రజలకు శుద్ధి నీరు అందిస్తామన్నారు.

20న హోం మంత్రి చేతుల మీదుగా తాగునీటి పథకంప్రారంభం

ఈనెల 20న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా అమృత్ తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి హోం మంత్రితోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. అలాగే రూ.4కోట్లతో నిర్మించిన మున్సిపల్ పార్కు ప్రారంభోత్సవం ,రూ.5కోట్లతో నిర్మించనున్న మైదుకూరు రోడ్డులో స్మార్ట్ స్ట్రీట్ పనులకు భూమి పూజ ఉంటుందన్నారు. అలాగే రాచమల్లు వారి రాజన్న భోజన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మునివంశీధర్‌రెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, అలాగే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

డాబా నిర్వహణ మాటున గంజాయి విక్రయం


అరెస్టయిన నిందితునితో సీఐలు, ఎస్ఐ, పోలీసులు

ముద్దనూరు : ముద్దనూరు–కడప ప్రధాన రహదారిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో ఓ వ్యక్తి డాబా నిర్వహణ మాటున గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ నరేష్‌బాబు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డాబా నడుపుతున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన గంగారామ్ అనే వ్యక్తి పలువురికి గంజాయిని విక్రయిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతన్ని అరెస్టు చేసి, 3150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఈబీ సీఐ చెన్నారెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

- జాతరకు రెండు వందల ఏళ్లకుపైగా చరిత్ర
- రేపు అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్న అమ్మవారి వేడుక


బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ


జాతరలో దర్శనమిచ్చే అమ్మవారి రూపం (ఫైల్)

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లెలో వెలసిన గంగమ్మ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లో ఎంతో విశిష్టత సంతరించుకుంది. ఆ గ్రామంలో గంగమ్మ స్వయంభుగా వెలసిందని పెద్దలు చెబుతున్నారు. ఏటా ఇక్కడ నిర్వహించే జాతరకు రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఒకే ఒక రోజు జరిగే ఈ జాతరకు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తారు. జాతరలో పాల్గొని అమ్మవారిని పూజించి పనులు ప్రారంభిస్తే తప్పక నెరవేరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందువల్ల బలిజపల్లె గంగమ్మ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గంగమ్మ జాతర వేడుక ప్రారంభం కానుంది.

సంప్రదాయాల సమ్మేళనం

బలిజపల్లె గంగమ్మ జాతర అనేక సంప్రదాయాల సమ్మేళనం అనే చెప్పాలి. అమ్మవారి జాతరను బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి నిర్వహిస్తారు. అందువల్ల తొలుత బలిజపల్లె జాతర నిర్వాహకులు జాతర తేదీని నిర్ణయించి.. అనంతరం తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె నిర్వాహకులతో వారి గ్రామాల్లో చర్చించి జాతర తేదీని ఖరారు చేస్తారు. అనంతరం ఒక ఆదివారం అంకురార్పణ చేసి ఆ తరువాత వచ్చే గురువారం జాతరను నిర్వహిస్తారు. అయితే జాతరకు ముందురోజు అర్ధరాత్రి నుంచే అమ్మవారి వేడుక అంగరంగ వైభవంగా ప్రారంభమవుతుంది. పై మూడు గ్రామాలకు చెందిన వారు అమ్మవారికి వివిధ రకాల సాంగ్యాలతో జాతరను ఘనంగా నిర్వహస్తారు.

బలిజపల్లెలో రూపుదిద్దుకోనున్న అమ్మవారి ప్రతిమ

జాతరలో కొలువుదీరే గంగమ్మ ప్రతిమను బుధవారం రాత్రి నుంచి ఆ గ్రామంలోని ఓ వేపచెట్టు కింద దాదాపు ఆరుగంటల పాటు తయారు చేస్తారు. అనంతరం అమ్మవారి ప్రతిమను నిర్వాహకులు పూలరథంలో ఊరేగించుకుంటూ.. వేపమండలతో తయారు చేసిన గుడిలోకి ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువు తీర్చుతారు. అమ్మవారు గుడిలోకి ఊరేగింపుగా వచ్చే సమయంలో భక్తులు పెద్ద ఎత్తున ఎదురుగుంభం ఇచ్చేందుకు పోటీపడతారు. ఈ కారణంగా కేవలం యాభై అడుగుల దూరంలో ఉండే గుడిలోకి అమ్మవారిని తీసుకురావడానికి దాదాపు రెండు గంటల సమయం పడుతుంది. అమ్మవారిని గుడిలోకి తీసుకొచ్చే సమయంలోనే ఆ గ్రామానికి చెందిన పలువురు విశేష పూజలు నిర్వహించి సాంగ్యాలు సమర్పిస్తారు. అమ్మవారు గుడిలో కొలువు దీరగానే జాతర ఊపందుకుంటుంది.

తుమ్మల అగ్రహారం నుంచి గండదీయలు

బలిజపల్లెలో కొలువైన గంగమ్మకు తుమ్మల అగ్రహారం పుట్టినిల్లని పెద్దలు చెబుతుంటారు. అందువల్ల తుమ్మల అగ్రహారానికి చెందిన మహిళలు జాతరలో అమ్మవారు గుడిలో కొలువుదీరగానే గండదీయలను సమర్పిస్తారు. అగ్రహారం మహిళలు తీసుకొచ్చిన గండదీయలను చెల్లించే సమయంలో.. అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో ఉండే వేలాది మంది భక్తులను సైతం నిలిపివేస్తారు. గండదీయల చెల్లింపులో జాతర నిర్వాహకులు అగ్రహారం మహిళలకు ప్రత్యేకమైన ప్రాధాన్యతను ఇవ్వడం విశేషంగా చెప్పవచ్చు.

నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు

జాతర సందర్భంగా గంగమ్మ తల్లికి నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు తీసుకొస్తారు. ఈ సందర్భంగా గంగమ్మ సోదరుడైన పోతురాజును తప్పెట్లతో ఉత్సాహంగా బలిజపల్లెకు తీసుకొస్తారు. పోతురాజు ఊరేగుతూ వచ్చే సమయంలో భక్తులు కర్రసాము, ఐదడుగు నృత్యాలు చేస్తూ కోలాహలంగా బలిజపల్లెకు చేరుకుంటారు.

సేంద్రియ వ్యవసాయ పంటలతో ఆరోగ్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

కడప అగ్రికల్చర్ : సేంద్రియ పద్ధతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ వీరయ్య పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రెండవ రోజు సోమవారం సాంకేతిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బద్వేల్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే నమూనా కేంద్రంలో సేంద్రియ పద్ధతిలో పెంచుతున్న కంది, మెట్ట వ్యవసాయ పద్ధతులైన లోతు దుక్కులు, పంట కుంటలు, సమీకృత వ్యవసాయ పద్ధతులు, యంత్ర పరికరాలు, వానపాముల తయారీ కేంద్ర, పుట్టగొడుగుల యూనిట్‌లను వారికి చూపించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మహిళా రైతులు పాల్గొన్నారు.

కర్నూలు జట్టు ఘన విజయం


క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న కడప, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ–సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 140 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు 38.3 ఓవర్లలో మరో 6 పరుగులు చేసి 146 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. నెల్లూరు బౌలర్లు సుతేజ్‌రెడ్డి 3, అబ్దుల్ 2, చిన్నబాబు 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 15.3 ఓవర్లలో 43 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కర్నూలు బౌలర్ అక్షిత్‌రెడ్డి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లతో రాణించగా, వరుసగా రెండో ఇన్నింగ్స్‌లో సైతం 6 వికెట్లు తీసి.. ఒక్క మ్యాచ్‌లో 12 వికెట్లు తీసి సత్తా చాటాడు. దీంతో కర్నూలు జట్టు 239 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 395 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహించిన కడప, చిత్తూరు మ్యాచ్ డ్రాగా ముగిసింది. మూడో రోజు 383 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 104.4 ఓవర్లలో 438 పరుగులు చేసి ఆలౌట్ అయింది. చిత్తూరు బౌలర్ బాలాజీ 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 77 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. జట్టులోని గౌతమ్‌కృష్ణ తేజారెడ్డి 78 పరుగులు చేశాడు. ఈయనకు జతగా జెనిక్‌దాస్ 65 పరుగులు చేశాడు. కడప బౌలర్ సాయి ఆర్థిత్ రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 279 పరుగులు చేయగా, కడప జట్టు 438 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

చేపల వేటకు వెళ్లి.. మృత్యుఒడికి..

ఖాజీపేట : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృత్యుఒడికి చేరుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అగ్రహారం గ్రామానికి చెందిన మామిళ్ళ శ్రీనివాసులు (48) అనే వ్యక్తి ఆదివారం చేపల వేటకు వెళ్లి.. కనిపించడం లేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి సోమవారం పరిశీలించారు. ఖాజీపేట బుగ్గవంక దగ్గర దుస్తులను గమనించి నీటి కొలనులో వెతికారు. బురదలో చిక్కుకుని ఉన్న శ్రీనివాసులను గుర్తించి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసి శవపరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

బైక్ అదుపుతప్పి రిటైర్డ్ తహసీల్దారుకు గాయాలు


గాయపడిన బాలయ్య

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో సోమవారం బైక్ అదుపు తప్పిన ఘటనలో రిటైర్డ్ తహసీల్దారుకు గాయాలయ్యాయి. స్థానిక తెలుగుగంగ కాలనీలో నివసించే బాలయ్య కాశినాయన మండల తహసీల్దారుగా పని చేస్తూ పదవీ విరమణ పొంది ఇంటి వద్దే ఉంటున్నాడు. సోమవారం ఓ పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంలో నెల్లూరు రోడ్డులో వెళుతుండగా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సహాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ ఎంపికలు


జిల్లా బాస్కెట్‌బాల్ సబ్‌జూనియర్ బాలికల జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, కృష్ణయ్య నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు : మణికంఠ, విజయభాస్కర్, నరసింహ, మనీష్‌రెడ్డి, తమన్, కిశోర్, హేమంత్, ప్రణీత్, సంతోష్‌రెడ్డి, భాను, విజ్ఞాన్, నిశార్, నాగార్జున (మేనేజర్).

జిల్లా బాలికల జట్టు : డి.నందిని, హస్సిని, వైశాలి, రెడ్డిలక్ష్మి, ధనశ్రీ, శరణ్యాదేవి, రెడ్డిసాయి, భవ్య, నిహారిక, వెంకటమౌనిక, అనిత, ధరణి, వెంకటసుబ్బమ్మ (మేనేజర్).

ఉపాధ్యాయురాలిని కొనసాగించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో ఇంగ్లిషు ఉపాధ్యాయురాలు సునందను కొనసాగించాలని కోరుతూ సోమవారం విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాదరెడ్డిని కోరారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న వారు 'విచారణ కమిటీ విచారించకుండానే ఉపాధ్యాయురాలిని ఎలా బదిలీ చేస్తారు? విచారణ కమిటీ వచ్చినప్పుడు మా అభిప్రాయం వారికి చెబుతామని' పేర్కొన్నారు. విద్యార్థిని తల్లి ఉపాధ్యాయురాలి పట్ల దురుసుగా మాట్లాడటం ఎంత వరకు సబబు అని, విద్యార్థులు తప్పు చేస్తే ఉపాధ్యాయులు మందలించడం సహజమే అన్నారు. అక్కడికి చేరుకున్న ఎంఈఓ–2 శోభారాణి తల్లిదండ్రులతో మాట్లాడుతూ మంగళవారం విచారణ కమిటీ వస్తుందని, వారు విచారించిన తరువాత ఉపాధ్యాయురాలి బదిలీపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

సస్పెండ్ చేయాలి

ఉపాధ్యాయురాలు సునందను సస్పెండ్ చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, కోశాధికారి లీలాకృష్ణ, జాయింట్ సెక్రటరీ శరత్‌కుమార్, ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు రామలత, ప్రమీల, సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐవైఎఫ్ నాయకులు సందీప్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీలు నిషేధం

కడప ఎడ్యుకేషన్ : విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిరసన ర్యాలీలు నిషేధించినట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఏమైనా సమస్యలు ఏర్పడినప్పుడు కొంత మంది ఉద్దేశ పూర్వకంగా విద్యార్థులను రెచ్చగొడుతూ ర్యాలీలు, నిరసన చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


మృతి చెందిన సుహాసిని

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన సూరపురెడ్డి సుహాసిని అలియాస్ బుజ్జమ్మ (48) సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. భర్త క్రిష్టారెడ్డితో కలిసి సుహాసిని పశువులకు మేత తెచ్చేందుకు పొలానికి వెళ్లింది. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ


ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ మహిళా కమిషన్ మెంబర్ గజ్జల లక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రూరల్ ప్రాజెక్టు పరిధి పెండ్లిమర్రి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, హాస్టల్‌ను ఏపీ మహిళా కమిషన్ మెంబర్ గజ్జల లక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె హాస్టల్‌లోని వంటలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తరువాత గుర్రాల చింతలపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, సీడీపీఓ రమాదేవి, సూపర్‌వైజర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

రాజంపేట : చెయ్యేరులో ఆదివారం లభ్యమైన మృతదేహం కడప నగరంలోని రాజారెడ్డి వీధి సియోనపురానికి చెందిన మలూరు శ్రీనివాసుల(59)ది గుర్తించామని రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య తెలిపారు. సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయనకు అప్పులు అధికమయ్యాయని సీఐ పేర్కొన్నారు. అప్పులు తీర్చేందుకు ఉద్యోగానికి కూడా వీఆర్ఎస్ ఇచ్చారన్నారు. అప్పుల బాధ తట్టుకోలేక జీవితం మీద విరక్తి చెంది చనిపోవాలనే ఉద్దేశంతో విషం తీసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణ అయిందన్నారు. మన్నూరు పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనువాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి సంబంధీకులకు అప్పగించామన్నారు.

12 ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుకున్న ఎర్రచందనం దుంగలు, నిందితులతో సీఐ, ఎస్ఐ, పోలీసులు

దువ్వూరు : జిల్లెల్ల గ్రామ సమీపంలోని కుందూ నది ఒడ్డున గడ్డి పొదల్లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు. దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైదుకూరు రూరల్ ఇన్‌చార్జి సీఐ బీవీ చలపతి వివరాలు వెల్లడించారు. 12 ఎర్రచందనం దుంగలతోపాటు మూడు పట్టుడు రాళ్లు, ఒక గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎద్దుల వెంకటరమణ, దువ్వూరు మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసు, కలసపాడు మండలం చెన్నుపల్లె గ్రామానికి చెందిన గట్టు భాస్కర్, చాగలమర్రి మండలం పెద్దవంగలికి చెందిన వడ్ల నరసింహయ్యను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన మైదుకూరు రూరల్ ఇన్‌చార్జి సీఐ బీవీ చలపతి, దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్‌స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

కడప రూరల్ : గర్భిణులను గుర్తించి, వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, పీసీ అండ్ పీఎన్‌డీటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. డీపీహెచ్ఎన్ఓ అరుణ కుమారి మాట్లాడుతూ గర్భిణులకు అందించే సేవలు, ఆరోగ్య కార్యక్రమాలపై తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డెమో భారతి, కుమారి, మౌనికమ్మ, పాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోనసీమను తలపిస్తున్న పుష్పగిరి

జిల్లాలోని వల్లూరు మండల పరిధి పుష్పగిరి ప్రాంతం కోనసీమను తలపిస్తోంది. భూమికి పచ్చాని రంగేసినట్లు కనిపిస్తోంది. కనుచూపు మేర పంట పొలాలు, వాటి మధ్యలో కొబ్బరి చెట్లు కనువిందు చేస్తున్నాయి. అల్లంత దూరన ఉన్న కొండ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. పెన్నానది పరీవాహక ప్రాంతం కావడంతో.. అన్ని కాలాల్లోనూ పచ్చగా కళకళలాడుతోంది.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప





